అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు కళాకారులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను చాటే విధంగా నృత్యాలు చేశారు. డాక్టర్ వనజ ఉదయ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిషన్ సొసైటీ సబ్ కమిటీ కన్వీనర్ ముఖైర్ అహ్మద్ పాల్గొన్నారు.

బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడిగా సుమన్‌కుమార్



గౌలిపురా: బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడిగా హనుమాన్‌నగర్‌కు చెందిన ఇటిక్యాల సుమన్‌కుమార్ ముదిరాజ్‌ను నియమించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వాహణ కమిటీ సుమన్ కుమార్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన్ మాట్లాడుతూ..పార్టీ కోసం పని చేసే వారికి సమయానుకూలంగా గుర్తింపు ఉంటుందన్నారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర నాయకులు, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వాహణ కమిటీ, సీనియర్ నాయకులు, గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వార్షికోత్సవం



వేడుకల్లో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: టోలిచౌకీ సమత కాలనీలోని కంపాస్ గ్రామర్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు, వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కాలానికి అనుగుణంగా విద్యా బోధనల్లో కూడా ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. వీటికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ అల్తాఫ్‌హుస్సేన్, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, డాక్టర్ మజీద్ అలీ అఫ్రోజ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట ఇంద్రానగర్‌లోని హిందూ శ్మశాన వాటికను కబ్జా చేస్తూ నిర్మించిన ప్రహరీని బండ్లగూడ మండల రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఇంద్రానగర్‌లోని శ్మశాన వాటిక ముందున్న స్థలం చుట్టూ కొందరు వ్యక్తులు ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మించారు. ఈ విషయమై బస్తీవాసులు, దిశా కమిటీ గౌరవ సభ్యుడు కృష్ణా నాయక్‌ల బృందం గత వారం బండ్లగూడ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై విచారించిన అధికారులు సోమవారం జేసీబీతో అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. అధికారులు స్పందించి కబ్జా చెర నుంచి విముక్తి కల్పించినందుకు బస్తీవాసులు శ్రీహరి, యాదగిరి, కుమార్, నరేష్, శివకుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించండి

జియాగూడ: సంజయ్‌నగర్‌లోని హనుమాన్ ఆలయానికి ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని వెంటనే మరో చోటుకి తరలించాలని తెలంగాణ రాష్ట్ర శ్రీ సూర్యవంశీ సంతోషం రావిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం సీతారాంబాగ్‌లోని విద్యుత్ ఏడీఈ గణేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బస్తీ సంఘం సభ్యులు మహేష్కర్ కాంతిలాల్, బాల్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ.. మహనుమాన్ ఆలయం పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో గుడికి వచ్చే భక్తులు తరచూ విద్యుత్ షాక్‌కు గురవుతున్నారని, ఇటీవల గొర్రె, మేకలు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మరణించాయన్నారు. త్వరలో సంత్ రవిదాస్ జయంతి వేడుకలు ఉన్నాయని వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ తరలించకపోతే ప్రాణాపాయం ఉందన్నారు. మాధవరావు బిరాదర్, రుద్రమని పాంచాల, సంతోష్ మహేష్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న రవిదాస్, సంఘం సభ్యులు

సరస్వతీ నమస్తుభ్యం..



సరస్వతి విద్యానికేతన్‌లో.. కరెస్పాండెంట్ బలరాజ్ కావలె, సునేత్ర



శాంతినగర్ శ్లోకా ది స్కూల్‌లో అక్షరాభ్యాసం

ఘనంగా వసంత పంచమి వేడుకలు

వసంత పంచమి వేడుకలను సోమవారం అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సరస్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల్లో, విద్యాసంస్థల్లో సరస్వతీ దేవికి పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



గుడిమల్కాపూర్ దుర్గామాత ఆలయంలో..



శివలాల్‌నగర్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్‌లో..



మాధవ నగర్‌లోని విద్యా భారతి విజ్ఞాన కేంద్రం పాఠశాలలో..



గౌలిపురాలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో..



జియాగూడ కాకతీయ స్కూల్‌లో.. ప్రిన్సిపాల్ వికాస్ చంద్ర

విజయనగర్ కాలనీలో.. సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు





ఎస్ఎస్‌కే సమాజ్ సరస్వతి ఆలయంలో..

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



గెలిచిన విద్యార్థులతో శ్రీనివాసరాజు తదితరులు

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని కిడ్స్ విల్లా స్కూల్ నిర్వాహకులు కె.శ్రీనివాసరాజు అన్నారు. గత వారం రోజులుగా కిడ్స్ విల్లా స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిడ్స్ విల్లా స్కూల్ చిల్డ్రన్ చెస్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



బ్రేకర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముబీన్, విద్యుత్ ఎస్ఈ సోమిరెడ్డి

చార్మినార్: రానున్న వేసవి కాలంలో వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ సోమిరెడ్డి తెలిపారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్‌తో కలిసి ఆయన సోమవారం పాతబస్తీలో పర్యటించి మీరాలం సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా మీరాలం సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ బ్రేకర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో ప్రస్తుతం సరఫరా జరుగుతున్నట్లే..వేసవి కాలంలో కూడా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. వేసవి కాలంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటున్నందున లోడ్ కూడా ఎక్కువ ఉంటుందన్నారు. పెరిగే లోడ్‌కు అనుగుణంగా అవసరమైన చోట కొత్త ఫీడర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ డీఈ శ్రీధర్, చార్మినార్ సీబీడీ ఏడీఈ మహ్మద్ అక్బర్, మజ్లిస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'దరఖాస్తు చేసుకున్న వారందరికీ న్యాయం చేస్తా'



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ న్యాయం చేసేలా చూస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మజ్లిస్ నాయకులు ఆయనను కలిసి తమ తమ ప్రాంతాల్లోని సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇంకా ఆందోళనలోనే ఉన్నారని వారి దరఖాస్తుల పరిశీలనకు ఇంత వరకు సర్వే అధికారులు రాలేదని గోల్కొండ చోటాబజార్‌కు చెందిన అబీబ్ చౌస్ ఆయన దృష్టికి తెచ్చారు. మరికొందరు ఆహార భద్రత కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆ దరఖాస్తులకు కూడా పరిశీలించడానికి అధికారులు ఎవరు రాలేదని మరి కొందరు ఆయన దృష్టికి తెచ్చారన్నారు. అన్ని రకాల ధ్రువపత్రాలు జతచేసి దరఖాస్తులు చేసుకున్న వారికీ తప్పకుండా న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే తనను కలిసిన వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబీబ్‌చౌస్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కిషన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: క్వాంటమ్ కంప్యూటింగ్ ఘనాత్మక శక్తిలో విప్లవాత్మక మార్పులను తెచ్చే సాంకేతిక అని ఓయూ ఘనిత విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.కిషన్ అన్నారు. సోమవారం అబిడ్స్ చాపల్‌రోడ్డులోని స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గణిత బోధకుల అభివృద్ధి కార్యక్రమం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి తరం విద్యార్థులు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు బోధకుల అభివృద్ధిపై శిక్షణా తరగతులను నిర్వహించడంపై ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ పి.అనురాధ, వక్త షేక్ అహ్మద్, కళాశాల సెక్రెటరి కె.కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ దశరథరెడ్డి సేవలు ఎనలేనివి



నివాళులర్పిస్తున్న వివిధ రెడ్డి సంఘాల నేతలు

సుల్తాన్‌బజార్: ప్రొఫెసర్ దశరథరెడ్డి సేవలు ఎనలేనివని వక్తలు పేర్కొన్నారు. దశరథరెడ్డి అకాల మరణంపై రెడ్డి జన సంఘం ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సంతాప సభను సోమవారం అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లో నిర్వహించారు. రెడ్డి జన సంఘం అధ్యక్షుడు వి.నర్సింహారెడ్డి దశరథరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ..దశరథ రెడ్డి మరణం రెడ్డి సంఘానికి తీరని లోటు అని ఆయన అహర్నిశలు సంఘం కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రెడ్డి జన సంఘం ముఖ్య కార్యదర్శి కె.పాండురంగారెడ్డి, జైపాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మట్టారెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవ రెడ్డి, మదుసుధన్‌రెడ్డి, రావుల శ్రీధర్, స్వరూపరాణి, సుఖన్యరెడ్డి, పుష్పలత పాల్గొన్నారు.

కవయిత్రి సత్యవీణకు సత్కారం



అఫ్జల్‌గంజ్: ప్రముఖ కవయిత్రి మోదేత్రి సత్యవీణను ఘనంగా సత్కరించారు. సూరెపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అమృత కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమెను ప్రముఖ సంఘ సేవకులు అమృత్‌కుమార్ జైన్, ట్రస్ట్ అధ్యక్షుడు సూరెపల్లి రవికుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సూరెపల్లి రాములమ్మ ఉమెన్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం మహిళా వికాసానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాంబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు ఆమోదమైన బడ్జెట్



వెంకటేష్

చార్మినార్: ది పవర్ ఆఫ్ రైజింగ్ మిడిల్ క్లాస్ పేరుతో నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, కార్యాలయ ఇన్‌చార్జి ప్యారసాని వెంకటేష్ అన్నారు. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపుతో పాటు రూ.18 లక్షల వరకు ఆదాయం వచ్చే వారికి రూ.70 వేల వరకు లబ్ధి, రూ.25 లక్షల ఆదాయం వచ్చే వారికి రూ1.10 లక్షల వరకు లబ్ధి కలుగుతుందన్నారు. కొత్తగా రాష్ట్రాల మధ్య పోటీ పెంచేందుకు కొత్తగా ఇండెక్స్ ఆఫ్ స్టేట్స్, టీడీఎస్, టీసీఎస్ రేట్ల తగ్గింపు, సీనియర్ సిటిజన్లకు మినహాయింపు మొత్తం రూ.లక్షకు పెంపు తదితర ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇలా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆమోదం పొందిందన్నారు.

కూల్చివేతలను పరిశీలించిన ప్రాజెక్టు అధికారులు



యాకుత్‌పురా: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న మెట్రో రైలు ప్రాజెక్టు పనుల కోసం భవనాల కూల్చివేతలను సోమవారం ప్రాజెక్టు విభాగం అధికారులు పరిశీలించారు. పురానీహవేలీ, మీరాలం మండి, అలీజాకోట్లా, బీబీ బజార్ చౌరస్తా, మొఘల్‌పురా హోల్డా హోటల్ ప్రాంతాల్లో కొనసాగుతున్న కూల్చివేతలను హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వినోద్ కుమార్, మేనేజర్ నర్సింగ్ రావు పరిశీలించి అధికారులతో ఆరా తీశారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు రాకుండా కూల్చివేతలు నిర్వహించాలని అధికారులు సూచించారు.

సన్మానం



చాంద్రాయణగుట్ట: బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్‌కు భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు నవీన్ బండారి, కద్దాల్ సుభాష్‌తో కలిసి ఆయనను శాలువా కప్పి సన్మానించారు. పార్టీలో బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేసిన వారికి రాష్ట్ర స్థాయి వరకు కూడా అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న నాయక్

చార్మినార్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న నాయక్ అన్నారు. సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని బస్తీ, కాలనీల వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్‌ప్లానింగ్ జోనల్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ప్రబోధ్ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

జియాగూడ: రహీంపురా కాగజ్‌గూడ సత్తెన్న గల్లీ ప్రబోధ్ బాలికల ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాటి పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి, ఉపాధ్యాయురాలు వర్ధ జ్ఞానేశ్వర్‌గౌడ్, శాంత, కె.రమాదేవి, విద్యారాణి, మల్లేష్, జ్యోతి, కళావతి, ఉషారాణి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ధన్‌రాజ్, సందీప్, సతీష్, రమాదేవి, సరిత, గోపాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంకు హాజరైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు. చివరగా హర్షిక, శ్రీనిధి, ఖుషిల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

బెంగాలీల సరస్వతి పూజలు ప్రారంభం



భక్తులతో కలిసి సరస్వతీ దేవి పూజలను ప్రారంభిస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో బెంగాలీల సరస్వతీ పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఈ పూజలను ప్రారంభించారు. బెంగాలీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సరస్వతి పూజల సందర్భంగా బెంగాలీలు సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ఈ నెల 5న బెంగాలీలు సరస్వతీ దేవి విగ్రహంతో పెద్ద ఎత్తున నిమజ్జనోత్సవ ఊరేగింపు నిర్వహించనున్నారు. మీరాలంమండి నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు అలీజా కోట్ల, కాలికమాన్, గుల్జార్‌హౌజ్, మదీనా సర్కిల్, నయాపూల్ ద్వారా హుస్సేనీసాగర్ వరకు కొనసాగనుందని అంజయ్య తెలిపారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్

అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్ అహర్నిశలు పాటుపడుతుందని కేంద్ర సంఘం టీఎన్జీఓస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా కుర్రాడి శ్రీనివాస్ పదోన్నతి పొందడంతో ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలు అంచెలంచెలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కుర్రాడి శ్రీనివాస్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో కార్యదర్శిగా నియమించినందుకు కేంద్ర సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి : దేవర శ్రీనివాస్



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భారత దేశ చరిత్రలోనే ఉత్తమమైన బడ్జెట్ అని అన్నారు. ఈ బడ్జెట్ ప్రధాని మోదీ విధానాలు, ఆలోచనలు, దేశం కోసం ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను ప్రతిభింబిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి వారితో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు సైతం ఈ బడ్జెట్ ఎంతో ఊరట ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామ యాదగిరినేత, సాగర్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: అన్ని ప్రభుత్వ విభాగాలతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. తలాబ్‌కట్టా షాజాహన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం ఆయన తలాబ్ చంచలం, రెయిన్ బజార్ డివిజన్ల కార్పొరేటర్లు సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్‌తో పాటు పలు విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానికంగా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షుడు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యం

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న బాలస్వామి, ఎస్సై శివ కుమార్

గౌలిపురా: భర్తతో గొడవపడి ముగ్గురు పిల్లలతో కలిసి చనిపోతానని ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణిని భవానీనగర్ పోలీసులు క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్సై శివకుమార్ వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన నాజీనీన్ (30), ఇబ్రహీం దంపతులు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు జహీమా (10), ఆయేషా (8), మరియా (4) ఈ నెల 2న దంపతుల నడుమ స్వల్ప గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన నాజీనీన్ చనిపోతానని చెప్పి ముగ్గురు పిల్లలతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టి కందుకూరు, ఆమన్‌గల్, కడ్తాల్ పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇచ్చారు. ఆమన్‌గల్ ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆమన్‌గల్ వచ్చే ప్రతి బస్సును తనిఖీ చేస్తుండగా రాత్రి 10.15 గంటల సమయంలో నాజీనీన్ ముగ్గురు పిల్లలతో కలిసి కనిపించగా వారిని భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులను అప్పగించారు. ఓ కుటంబాన్ని కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.